నిర్ణయం

ఆ.. 'ట్రింగ్.... ట్రింగ్....' టెలిఫోన్ మోగుతోంది. ఎక్కడో కలలో వినిపిస్తున్నట్లు ఉంది. మోత ఎక్కువ కావడంతో మెలకువ వచ్చింది. లైటు వేసి రిసీవర్ ఎత్తి "హలో!" అన్నాను.

"అరుణా! నేను ఉమను మాట్లాడుతున్నానే... నీవొకసారి అర్జెంట్‌గా ఇక్కడకు రావాలే!" అవతలి నుండి ఉమ గొంతు.



"ఏమైందే...?" కంగారుగా అడిగాను.

"అంత కంగారు పడవలసిన పనేం లేదు. నీతో కొన్ని ముఖ్యమైన విషయాలు మాట్లడాలి. రేపు రాగలవా?" మాటల్లోనే ఆత్రం తప్ప నిజానికి అంత అర్జెన్సీ ఏమీ లేదనే విషయం తెలిసి కొంత ఊపిరి పీల్చుకున్నాను. గడియారంలో రెండుంపావు అవుతోంది.

"ఏమైందే.... వింటున్నావా?" ఉమ గొంతు.

"ఆఁ...ఆఁ... వింటున్నాను. వస్తాను!" పరధ్యానంతోనే అన్నాను.

"రెండు రోజులు ఉండేలా లీవు పెట్టుకుని రావే...! టెలిఫోన్ కాన్ఫరెన్స్‌లు, వీడియో కాన్ఫరెన్స్‌లు అంటూ ఏదో ఒకసాకు చెప్పి ఎగ్గొట్టకు! నీవొస్తే ఒక ముఖ్యమైన విషయంలో నీ నిర్ణయం తీసుకోవాలనుకుంటున్నాను!" తన ధోరణిలోనే చెప్పుకుపోతోంది.

"రెండురోజులంటే ... లీవు దొరకడం కష్టమే. అయినా ట్రై చేస్తాను!" నా మాటలకు హర్ట్ అయినట్లుగా ఫీలైందేమో...

"అరుణా! నాకు గత కొద్దిరోజుల నుండి రాత్రిళ్లు అసలే నిద్రపట్టడంలేదు. ఏవేవో పిచ్చి పిచ్చి ఆలోచనలు. నేనేమైపోతానోనని నాకే భయంగా ఉంది. అందుకే టైమ్ కూడా చూసుకోకుండా నీకు ఫోన్ చేశాను. తప్పకుండా రావే!" ప్రాధేయపడుతున్నట్లుగా మాట్లాడుతుంటే నాకు ఉమమీద జాలి వేసింది.

"ఉమా! నీకేమైనా పిచ్చా...! నన్ను రమ్మనడానికి ఇంతగా రిక్వెస్ట్ చేయాలా! రేపు తప్పకుండా వస్తాను, సరేనా! ఇక నీవు నిశ్చింతగా నిద్రపో!" గుడ్ నైట్ చెప్పేసి ఫోన్ పెట్టేశాను.

నిద్ర చెడితే మళ్లీ నిద్రపట్టాలంటే చాలా కష్టం. కనీసం అరగంటైనా కావాలి. సి.డి. ఆన్ చేశాను. 'హమ్ ప్యార్ మె జీనేవాలోంకో చైన్ కహాఁ... హయ్ ఆరామ్ కహాఁ...' లతా మంగేష్కర్ పాట వస్తోంది. ఎక్కడో గుండెల్లో కదలిక ఉమను గూర్చి ఆలోచిస్తుంటే ఒక్కోసారి పిల్లిగా అనిపించినా అదే కరెక్టేనేమో అనిపిస్తుంది. ఉమ, నేను చిన్ననాటి స్నేహితురాళ్లం కాకపోయినా ఉద్యోగంలో చేరినప్పటి నుండి చాలా స్నేహంగా ఉంటున్నాం. మా పరిచయం

వనమాల చంద్రశేఖర్

మరో డాన్సింగ్ డాల్!

ఇంకెవరో కాదు, సోనాలిబెంద్రే. రాజ్‌కంవర్ చిత్రం 'ధాయీ అక్షర్ ప్యార్ కే'లోనూ, రాజ్‌కుమార్‌సంతోషి చిత్రం 'లజ్జా'లోనూ సోనాలి చెరోపాట, డాన్సుల దృశ్యాల్లో పాల్గొందని చెప్పుకుంటున్నారు. అదేమిటని అడిగితే, ఆ దర్శకులిద్దరూ తమ రాబోయే చిత్రాల్లో పూర్తి నిడివిగల పాత్రలిస్తామని మాటిచ్చారనీ, అందుకే ఆ నాట్యసందర్భాల్లో చేయడానికి ఒప్పుకున్నాననీ అంటూంది సోనాలి. కానీ అవి నిజమైనప్పటి సంగతి కదా? అంటున్నారు సినీజనం. కానీ పాపం, సోనాలి ప్రియుడు గోల్డీబెహల్ మాత్రం సోనాలి అంటే చాలా అభిమానం చూపుతున్నాడు కనుక, ఇక త్వరలో పెళ్లాడేసి స్థిరపడిపోతుందని కొందరు దర్శకులు ఆమెను తమ చిత్రాల్లో తీసుకోవడం లేదని మరికొందరంటున్నారు. ఏదెలా జరుగుతుందో ఎవరూ ఊహించలేరు కదా!

ఎన్.



ట్రైనింగ్‌లో జరిగింది . అప్పటినుండి మా మధ్య ఏ విషయంలోనూ ఎలాంటి దాపరికాలూ లేవు. నా వ్యక్తిత్వానికి, ఉమ వ్యక్తిత్వానికీ అసలు పోలికే లేదు. అయినా ఇద్దరం చక్కగా కలిసిపోయాం.

ఉమ చాలాసార్లు అనేది 'ఈ మనుషులు ఎందుకంత డర్టీగా బిహేవ్ చేస్తారు? వాళ్లు అలా ఎందుకుండాలి? ఇలా ఎందుకు ఉండకూడదూ?'లాంటి ప్రశ్నలతో నా బుర్ర తినేది.

ఆమెకు ఎలా అర్థం చేయించాలో తెలియక చాలాసార్లు తికమక పడేదాన్ని కానీ, ఆమెకు ఏ విధంగా చెప్పాలో అలా చెప్పేదాన్ని. అందువల్లే నాతో చాలా చనువు పెంచుకుంది. ట్రైనింగ్ పూర్తయిన తర్వాత నాకు కరీంనగర్ జిల్లాకు, ఉమకు వరంగల్ జిల్లాకు పోస్టింగ్ ఇచ్చారు. నెలకొకసారైనా నేను ఉమ దగ్గరకెళ్లటమో, లేక ఉమనే నా దగ్గరకు రావటమో చేస్తూంటాం. మధ్యలో రెండు మూడు రోజుల కొకసారి ఫోన్. మేము కలుసుకున్న ప్రతిసారీ ఏదో ఒక టాపిక్‌మీద గంటలు గంటలు చర్చ జరిపేవాళ్లం. కానీ చాలా సందర్భాలలో స్వవిషయాల మీదే చర్చ జరిగేది.

"అరుణా! అమాయకులే ఆనందంగా ఉంటారేమో! మనం చదువుకోకపోయి ఉండి ఉంటే బాగా సుఖపడేవాళ్లం కదా!"

"నీ బొంద! చదువుకున్నాం కాబట్టే, మనం ఈ మాత్రమైనా సుఖపడగలుగుతున్నాం."

"నేనే తెలివిలేని దాన్ని అనుకుంటాను. ఇప్పుడు అర్థం అయింది. నీవు కూడా నాలాంటిదానివేనని. చదువుకుని మనం ఏం సుఖపడుతున్నాం?"

ఉమ మాటలకి చిరాకనిపించింది.

"నీ దృష్టిలో సుఖమంటే ఏమిటి? పెళ్లి చేసుకుని పిల్లల్ని కని భర్త పాదాల దగ్గర పడి ఉంటూ పిల్లల్ని సాకడమేనా? భర్త ఆదరిస్తే జీవితం సాఫీగా సాగడం, లేదంటే మధ్యలోనే విడాకులకోసం కోర్టులోనో, లేదంటే కాలిన గాయాలతో హాస్పిటల్‌లోనో జీవితానికి అర్థం తెలుసుకోవడం... ఇదేనా నీ వనుకునే సుఖమైన జీవితం?" కాస్త గట్టిగానే మందలిస్తున్నట్లు అన్నాను.

"అరుణా! నీ దృష్టిలో జీవితానికి అర్థం అదే అయితే నేనేమీ అనలేను. కాదంటే ఉద్యోగంలో మాత్రం ఉన్న సుఖమేమిటి? జీతంకోసం పనిచేసే బానిసలమే తప్ప మనమెవరికైనా సహాయపడింది ఉందా? సాధించామని చెప్పుకోవటానికి ఒక్క సంఘటనైనా చెప్పగలవా? పిల్లల్ని కనడానికే పెళ్లి కాకపోయినా, జీవితం పరిపూర్ణం కావటానికైనా కుటుంబ వ్యవస్థ అవసరం!" ఉమ ముఖంలో ఎప్పుడూ కనపడని ఒక అసంతృప్తి కనపడింది.

విషయాన్ని బయటకు లాగాలనే ఉద్దేశంతో రెచ్చగొట్టాను. "అంటే నీ వేమంటావు? ఉద్యోగాన్ని వదిలేసి పెళ్లి చేసుకుంటే సుఖపడతానంటావు, అంతేనా!" ఈసడించినట్లుగా అన్నాను.

నా మాటలకి కాస్త ఫీలయినట్లుంది. "అరుణా! నీవు నా పాయింట్‌ని సరిగా అర్థం చేసుకోవట్లేదు. నేను ఉద్యోగాన్ని మానేయమనో, అలాగని పెళ్లి చేసుకోకుండా ఉండద్దనో చెప్పట్లేదు. మనకు మనలాంటి వాళ్లకు జరిగిన అన్యాయాన్ని గూర్చి గుర్తుచేస్తున్నాను. అంతే!"

"మనకు జరిగిపోయిన అన్యాయమేమిటి? నీ ఆలోచనలన్నీ చాలా వింతగా ఉంటాయి!" కాస్త కోపంగానే అన్నాను.

"అరుణా! మనం చిన్నప్పటినుండి ఎన్నింటిని కోల్పోయామో గుర్తుచేసుకున్నావా? ఫాల్స్ ప్రెస్టేజ్ కోసం దేనికైనా వెనుకాడని మనం, మన పొజిషన్‌ని చూసుకుని అందరిముందూ 'ఇగో' ఫీలవుతుంటాము. అదేమంటే ఇంటలెక్చువాలిటీ నుపయోగించి మనను మనమే సమర్థించుకుంటూ హిపోక్రసీలోనే మగ్గిపోతూంటాం.".

"నాకైతే నీవు చెప్పేదేమిటో అర్థం కావట్లేదు."

"నీ చిన్నప్పటి సంగతులు నాకు తెలియవు. కాకపోతే నా సంగతి చెపుతాను. మనుషుల్ని కూడా సరిగా గుర్తుపట్టని మూడేళ్ల వయస్సులోనే బడికి పంపించి చదువు బాధ్యతను నా వీపుకు తగిలించారు. అప్పుడు మొదలైన నా చదువు 26 సంవత్సరాల వయస్సు వరకూ నన్ను వదల్లేదు. మా పక్కవీధిలోని నా తోటి పిల్లలంత హాయిగా



ఆడుతుంటే నేను మాత్రం బండెడు పుస్తకాలతో బడికి వెళ్లేదాన్ని. పదవ తరగతిలో రాంక్ రాగానే, ఇంటర్మీడియెట్ బైపిసిలో జాయిన్ అయ్యాను.

"మా అబ్బాయికి డాక్టర్ కోర్సులో సీటు వచ్చిందని మా ఫాదర్ వాళ్ల ఆఫీసులో పనిచేసే కారు డ్రైవర్ ఇంటికొచ్చి స్వీట్స్ ఇచ్చినప్పుడు తెలిసింది. కాన్వెంట్ చదువులు రిచ్ కల్చర్‌ని నేర్పుతాయేమో గానీ, రిచ్ ఎడ్యుకేషన్ మాత్రం కాదని.

"... లక్షలు పోసి నిన్ను కాన్వెంట్‌లో చదివిస్తే కనీసం మెడిసిన్ సీటు కొట్టలేకపోయావు. నీకంటే మా డ్రైవర్ కొడుకే నయం. వాడు గవర్నమెంటు కాలేజీలో చదివి సీటు సంపాదించగలిగాడు!" నాన్న మాటలకు చాలా క్షోభపడ్డాను. మొదటిసారి చావాలనే ఆలోచన వచ్చింది. దాంతో నాకు మెడిసిన్ కోర్సుమీదే అసహ్యం వేసింది. మళ్లీ రాయకూడదనుకున్నాను. ఈ విషయంలో నాకూ, నాన్నకూ మధ్య ఆర్గ్యుమెంట్ జరిగింది. అమ్మ సర్దిచెప్పడంతో నాన్న ఊరుకున్నారు.

"తమ్ముడు విజయ్ ఇంటర్‌లో చేరిన తర్వాత 'అక్కా! నాకు మెడిసిన్ చదవాలనుంది. ఎలాగైనా నాకు సీటు వచ్చేలా చేయ'మని అడిగితే వాడికోసం నా డిగ్రీ ఫైనలియర్ పరీక్షల్ని కూడా లెక్కచేయకుండా వాడి ఎంసెట్ ప్రిపరేషన్‌కి నోట్స్ తయారుచేసి ఇచ్చాను. నేను ఎలాగూ సాధించలేకపోయాను. వాడి ద్వారానైనా సాధిద్దామనుకున్నాను. నా కృషి ఫలించి వాడికి మెడిసిన్‌లో సీటు వచ్చింది. కాకపోతే పేమెంట్ కోటాలో. అక్కడికి ఇంట్లో అందరూ తృప్తిపడ్డారు.

"ఎంతైనా కొడుకు ... కొడుకే... కూతురు కూతురే! కొడుకుగా వాడు నా పేరు నిలబెట్టాడు. పేమెంట్ కోటానో ఏదో ఒకటి ఉన్నది ... ఉన్నది అమ్మేసి అయినా వాడిని కష్టపడి చదివించి డాక్టర్‌ని చేస్తే ఆ తర్వాత వాడు ఇంతకన్నా ఎక్కువ సంపాదిస్తాడు!" వాళ్ల కొలీగ్ ఎవరితోనో అంటున్నాడు నాన్న. మొదటిసారి నాన్నమీద అసహ్యం వేసింది. నా పుట్టుకమీద నాకే జాలి వేసింది.

నా డిగ్రీ పూర్తయిన తర్వాత ఎంఎస్సీలో ఉన్నప్పుడు నా క్లాస్‌మేట్ బాబ్జీ అని ఖమ్మం జిల్లా అబ్బాయి చాలా మంచివాడు. క్లోజ్‌గా ఉండేవాళ్లం. అప్పుడప్పుడూ హోటళ్లకి, సినిమాలకి కూడా వెళ్లేవాళ్లం. కొద్ది రోజుల తర్వాత అతనే నా దగ్గర పెళ్లి ప్రపోజల్ పెట్టాడు. భయపడిపోయాను. వీలు కాదని రిజెక్ట్ చేశాను. మనం ఫ్రెండ్స్‌లాగే ఉందాం, అంతేగానీ, పెళ్లీ గిళ్లీ అంటే నాకు నచ్చవు అన్నాను. అతను నన్ను ఏమీ అనలేకపోయాడు. కనీసం నన్ను అసహ్యించుకున్నా బాగుండేదేమో! నావైపు దీనంగా, జాలిగా చూసిన ఆ చూపు నా కింకా గుర్తు.

తర్వాత పిహెచ్‌డిలో జాయినయ్యాను.

ఒకరోజు మా అమ్మమ్మ అమ్మతో అంటోంది "సుగుణా! అమ్మాయికి పెండ్లి చేయరాదే!"

"చూస్తున్నాం, కుదరట్లేదు. అమ్మాయి ఎంఎస్సీ చదివిందాయె. దానికి సరిపోయే సంబంధం దొరకదాయె! మన కులంలో చదువుకున్న మగపొలగాండ్లు తక్కువ గదా ... అయినా మీ అల్లుడు అదే పనిమీద ఉన్నాడు!" జవాబులో నిజం లేదని తెలిసినా తల్లిగా కూతురుని ఏమీ అనలేకపోయింది రాజేశ్వరమ్మ. బహుశా అమ్మమ్మకు కూడా అమ్మమీద జాలి వేసినట్లుంది. ఆ టాపిక్‌ని ఆపేసింది.

ఒకటి రెండుసార్లు అమ్మ ఈ టాపిక్‌ని నాన్న ముందు ఉంచితే...

"ఇప్పుడు వాడి మెడిసిన్‌కే లక్షలు లక్షలు ఖర్చు అవుతున్నాయి. ఇంకా దీని పెళ్లి అంటే ఎలా? నాకున్న ఉద్యోగంతో ఎంతని సంపాదించగలను? వాడి చదువు పూర్తయిన తర్వాతనే దీని పెళ్లి!"

"అలా అంటే ఎలా కుదురుతుందండీ... వాడి చదువుకు, దీని పెళ్లికి ముడిపెడితే సంబంధాలు దొరకటం కూడా కష్టమవుతుంది!"

అమ్మ మాటల్ని మధ్యలోనే తుంచేస్తూ "ఏ ఇంటర్ చదివిందో అయితే ఎవడో ఒకడు చేసుకునేవాడు. పిహెచ్‌డి చేస్తోందంటే అంతకన్నా ఎక్కువ సంబంధం వాళ్లే ముందుకొస్తారు. కట్నం కూడా ఎక్కువే ఉంటుంది. తక్కువ సంబంధాన్ని మనం ఒప్పుకున్నా మగపెళ్లివాళ్లు ఒప్పుకోవద్దా? అయినా, ఉమ ఊర్కే ఇంట్లోనే కూర్చోవడమెందుకు? ఏదైనా ఉద్యోగంలో చేరితే దానికి కాస్త రిలీఫ్‌గా

'పెళ్లి చూపుల్లో నేను నచ్చానని చెప్పావు. మీ నాన్నతో అబ్బాయి నాకు నచ్చలేదు, అన్నావట! ఉమ! మీ వ్యక్తిత్వం ఏమిటో? మిమ్మల్ని ఎంతో గొప్పగా ఊహించుకున్నాను. మీరు నాతోనే డైరెక్ట్‌గా చెప్పి ఉంటే చాలా స్పోర్టివ్‌గా తీసుకునేవాణ్ణి. ఫ్రెండ్స్‌లా మిగిలిపోయేవాళ్లం. ఎనీ వే, థ్యాంక్స్ ఫర్ యువర్ కాంప్లిమెంట్స్!'

ఉంటుంది. చేసుకునేవాడు కూడా ఉద్యోగం ఉందని ముందుకు రావచ్చు కదా!" నాన్న మాటలకు అమ్మ ఏ విధంగా స్పందించి ఉంటుందో ఊహించగలను.

మానవ సంబంధాలన్నీ ఆర్థిక సూత్రాలమీదనే ఆధారపడి ఉంటాయనే విషయం గుర్తుకురాగానే వారిద్దరి మీదా జాలి కలిగింది.

ఇంట్లో ఉంటే ఏదో రకమైన డిస్టర్బెన్స్ జరుగుతుందని గ్రూప్ 1 పరీక్ష కోచింగ్ కొరకు ట్యుటోరియల్‌లో జాయినయ్యాను. ఇంట్లో వాళ్లకోసం కాకపోయినా నా కోసం నేను ఉద్యోగం చేయాలనుకున్నాను. రెండేళ్ల కృషి ఫలితంగా గ్రూప్1లో ఉద్యోగం తగిలింది. ఇదీ నా గతం!"

చెప్పినదంతా విన్న తర్వాత ఉమతో అన్నాను. "అంతా నీదే తప్పున్నట్లు కనిపిస్తోందే! నీ తప్పుని కప్పిపుచ్చుకోవటానికి అమ్మా నాన్నలదే తప్పు అన్నట్లుగా చిత్రిస్తున్నావు!"

"నా జీవితంలోని దౌర్భాగ్యపు సంఘటనలు చెప్పానే కానీ అమ్మా, నాన్నలను చెడుగా చిత్రించి నీ దగ్గర సానుభూతి పొందడం కోసం మాత్రం కాదు. ఇంతవరకూ నన్ను రిసీవ్ చేసుకున్న వారెవ్వరూ లేరు. నీవైనా నన్ను సరిగ్గా అర్థం చేసుకుంటావనే నమ్మకంతో అన్నీ చెప్పాను!" ఏడుస్తూనే చెప్పింది ఉమ.

"ఏయ్... పిచ్చిదానా! ఏందుకే ఏడుపు ... ఊరికే అన్నాను!"

ఉమను దగ్గరకు తీసుకుని ఓదార్చాను. చాలాసేపు ఏడ్చింది. ఆరోజు నుండి మా మధ్య చనువు మరింత ఎక్కువైంది.

ఇద్దరం కలిసి టూర్లు చేసేవాళ్లం. నాతో పంపడానికి వాళ్ల ఇంట్లో కూడా ఏ అభ్యంతరం ఉండేది కాదు. నేను కూడా వాళ్ల ఇంటికి నెలకొకసారైనా వెళ్లి వచ్చేదాన్ని. వాళ్ల ఇంటికి వెళ్లినప్పటి నుండి తెలిసింది ఉమ చెప్పినవన్నీ వాస్తవాలేనని.

ఒక్కోసారి వాళ్ల నాన్న రాత్రి ఏ రెండింటికో వచ్చేవాడు. వెంట ఎవరో వచ్చి దిగబెట్టి వెళ్లిపోయేవారు. వచ్చిన తర్వాత వాళ్ల అమ్మ మీద కేకలేసేవాడు. ఆంటీ ఏమైనా అంటే ఆమెను తిడుతూ కొట్టేవాడు. ఇదేమిటి అని తెల్లారి ఆంటీ అడిగితే, "ఎన్నో ఇబ్బందులుంటాయి... ఇబ్బందుల్ని మరచిపోవడానికి తాగుతున్నాను!" అంటాడు.

"ఇబ్బందులు మీ కొక్కరికే కాదు కదా!" ఆంటీ అడిగితే

"మీకేమి ఇబ్బందులున్నాయి... దాని పెళ్లి ఎలా చేయాలని... వాణ్ణి అమెరికా ఎలా పంపించాలి?... అన్నీ నాకే కదా ఇబ్బందులు?"

ఇక ఆయనతో మాట్లాడలేక ఆంటీయే విరమించుకునేది. ఉమనేమో నా ముందు సిగ్గుతో చితికిపోయేది. అవన్నీ పట్టించుకోవద్దని నేను ధైర్యం చెప్పేదాన్ని.

ఈ రెండేళ్లలో ఉమకోసం వాళ్ల నాన్న చూసింది నాలుగే నాలుగు సంబంధాలు. అందులో ఒక సంబంధం ఇంట్లోవాళ్లెవరికీ నచ్చక కాన్సిల్ అయింది. మరొక సంబంధం ఉమ ఉద్యోగం అబ్బాయికి నచ్చలేదట! అలాగని రిజైన్ చేస్తానని ఉమ అంటే కూడా ఒప్పుకోలేదట. మిగతా రెండు సంబంధాలు ఇంట్లో వాళ్లందరికీ నచ్చాయి. అయినా సెటిల్ కాలేదు.

ఒక అబ్బాయి అమెరికాలో డాక్టరు. ఇంకో ఐదేళ్లలో అన్నీ సెటిల్ చేసుకుని ఇండియాకు వచ్చి నర్సింగ్ హోమ్ కట్టించాలనుకుంటున్నానని చెప్పాడట! మీ అమ్మాయి లీవు పెట్టి వస్తే ఐదేళ్ల తర్వాత ఇండియా వచ్చి మళ్లీ జాబ్‌లో జాయినవ్వవచ్చు. ఆమెకు అక్కడే ఉండటం ఇష్టమైతే నేను అక్కడే ప్రాక్టీసు చేసుకుంటాను. అంతా మీ ఇష్టం. మీ అమ్మాయి ఇష్టం అన్నాడట! "నా కూతురుని అమెరికా వాడికిచ్చి పెళ్లి చేయను!" అని ఖచ్చితంగా చెప్పేశాడట వాళ్ల నాన్న.

ఇంకొక సంబంధం కూడా అందరికీ నచ్చినా, మరో విధంగా కాన్సిల్ అయింది. అబ్బాయి ఢిల్లీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. వాళ్లది కరీంనగర్‌కు దగ్గర్లోనే ఏదో ఊరు. అమ్మా, నాన్నలంతా కరీంనగర్‌లోనే ఉంటున్నారట! పేరు సుధీర్‌కుమార్. అందరికీ నచ్చటమే కాకుండా మాటా ముచ్చటవరకూ వెళ్లింది. మంచి రోజులు లేవని చెప్తే నెలరోజుల తర్వాత మాట్లాడుకుందామని వాయిదా వేశారు. అబ్బాయి ఉమతో మాటల సందర్భంలో రెండు నెలల్లో అతనికి హైదరాబాదు ట్రాన్స్‌ఫర్ అవుతుందన్నాడని, 'అమ్మమ్మ వాళ్లకి దూరపు బంధువుల అబ్బాయని, చాలా మంచివాడన్నద'ని నాకు ఫోన్లో చెప్పింది. నాలుగైదు రోజుల తర్వాత తనే మళ్లీ ఫోన్ చేసింది.

"సుధీర్‌కు నేను నచ్చలేదటనే!" అని ఏడుస్తూ చెప్పింది.

"ఈ విషయాన్ని నీతో ఎవరన్నారు?" చాలా కూల్‌గానే అడిగాను.

"పెళ్లి చూపుల్లో నీ బిహేవియర్ అస్సలే నచ్చలేదని ఆ అబ్బాయి అన్నాడు, నీకెన్నిసార్లు చెప్పినా ఏం లాభం, నీ పద్ధతి నీదే అని కూడా కసురుకున్నారు నాన్న!" ఏడుస్తూనే అంది.

"ఏడవడమెందుకే? నచ్చడం, నచ్చకపోవడం వ్యక్తిగత విషయం. దానికోసం బాధపడే పనేమిటి?" ఓదారుస్తున్నట్లుగా చెప్పాను.

"నచ్చలేదని నా మొహం మీద చెప్పినా నేను బాధపడేదాన్ని కాదే! కానీ, నా కన్నతండ్రి నాతో నీవు ఆ అబ్బాయికి నచ్చలేదని అనడం... అప్పటికీ నేను ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. రెండు రోజుల తర్వాత ఢిల్లీ నుండి సుధీర్ మా ఆఫీస్‌కు ఫోన్ చేసి, 'పెళ్లి చూపుల్లో నేను నచ్చానని చెప్పావు. మీ నాన్నతో అబ్బాయి నాకు నచ్చలేదు, అన్నావట! ఉమ! మీ వ్యక్తిత్వం ఏమిటో? మిమ్మల్ని ఎంతో గొప్పగా ఊహించుకున్నాను. మీరు నాతోనే డైరెక్ట్‌గా చెప్పి ఉంటే చాలా స్పోర్టివ్‌గా తీసుకునేవాణ్ణి. ఫ్రెండ్స్‌లా మిగిలిపోయేవాళ్లం. ఎనీ వే, థాంక్స్ ఫర్ యువర్ కాంప్లిమెంట్స్!' నా సమాధానంకోసం చూడకుండా ఫోన్ పెట్టేశాడు.

"అరుణా! నాకైతే ఆ క్షణంలో బ్రైన్ హెమరేజ్



అయి చచ్చిపోయినా బాగుండుననిపించింది!" గొంతులోని జీర స్పష్టంగా గుర్తించగలుగుతున్నాను.

ఉమను ఓదార్చటానికి తెల్లవారే వరంగల్ వెళ్లి వచ్చాను. వచ్చేటప్పుడు సుధీర్ అడ్రసు, ఫోన్ నంబరు తీసుకున్నాను. మళ్లీ వారం అయినా కాకముందే ఈ ఫోను.

***

వరంగల్ చేరేసరికి రాత్రి పదయింది. బెడ్‌రూమ్‌లో మంచంమీద నిర్లిప్తంగా పడుకుని ఉంది ఉమ. నన్ను చూడగానే లేచి వచ్చి గట్టిగా పట్టుకుని ఏడ్చింది. అన్ని విషయాలూ రేపు మాట్లాడుకుందాం పడుకోమని చెప్పాను. ఉదయం పది గంటలకు రామప్పకు చేరుకున్నాం. మధ్యాహ్నం వరకూ తిరిగి చాలా ఎంజాయ్ చేశాం. అదే విషయాన్ని ఉమతో అన్నాను.

"ఏమిటీ నీతో ముఖ్యమైన విషయం మాట్లాడాలని పిలిపిస్తే ఎంజాయ్ బింజాయ్ అని మాట్లాడతావు?"

"ఓకే! అర్జంటుగా నీకు కరీంనగర్ జిల్లాకు ట్రాన్స్‌ఫర్ కావాలంటావు. లేదంటే ఉద్యోగానికే రిజైన్ చేస్తానంటావు. అంతే కదా! నీ అంత బుద్ధి తక్కువది మరొకరు ఉండరు. ఉన్న ఉద్యోగం వదిలేసుకోవడం కంటే కొంతకాలం సెలవు పెట్టుకోవడం బెటర్ కదా! పోనీ నీ ట్రాన్స్‌ఫర్ విషయం గురించి మీ ఇంట్లో వాళ్లతో మాట్లాడావా?" నిదానంగా అడిగాను.

"ఇంట్లో వాళ్లను కాదనుకునే కదా నిన్ను రమ్మని పిలిపించింది!" ఉమలో అసహనం...

"ఉమా! ఎంత కాదనుకున్నా వాళ్లు నీ తల్లిదండ్రులు... వాళ్లని కాదని నీవు సాధించేదేముంటుంది?"అనునయంగా అన్నాను.

"అందుకే అరుణా జాబ్‌కు రిజైన్ చేయాలనుకున్నాను. అప్పుడైతే ఎవరికీ ఏ సమస్యా ఉండదు కదా! అప్పుడు నాకు నేను ఏమైనా ఫరవాలేదు!"

"ఉద్యోగానికి రిజైన్ చేయడం వల్ల నీ సమస్యకి పరిష్కారం దొరుకుతుందని ఎలా అనుకున్నావు? నీ కున్న పరిస్థితులకు నీ ఉద్యోగం కష్టంగా తోస్తుంది. అంతేకానీ ఎప్పటికీ ఇలాగే ఉండవు కదా! కొంత కాలం లీవు పెట్టుకో, అంతేగానీ, రిజైన్ చేయద్దు" అన్నాను.

"అరుణా! నా కెందుకో అసంతృప్తి! ముప్పై ఏళ్లలో నేను సాధించింది ఏమైనా ఉందా అని ప్రశ్నించుకుంటే ఏమీ లేదని తెలుస్తుంది. మూడేళ్ల వయసులో మొదలైనకట్టుబాట్లు వయసుతోపాటు పెరిగాయే గానీ తగ్గలేదు. కనీస స్వేచ్ఛ లేకుండా ఎంతకాలం బతకడమే!" ఆకాశంలోకి చూస్తూ చెప్పింది.

"ఉమా! నీవొక్కదానివే ఆడపిల్లవు కాదు. నీవొక్కదానికే కష్టాలు లేవు. అందరూ నీలా కష్టపడుతున్నవాళ్లే. కాకపోతే కాస్త ఎక్కువా తక్కువా అంతే. ప్రతి విషయాన్నీ ఎగ్జాగరేట్ చేసి మాట్లాడుతూంటావు. నిన్ను అర్థం చేసుకునేవాళ్లు దొరికితే నీకు జీవితం మీద పాజిటివ్ అప్రోచ్ ఉంటుంది!" అర్థం చేయించడానికి చెప్పాను.

"... ..." ఏడుస్తూనే ఉంది ఉమ.

"ఉమా! నే నొచ్చేటప్పుడు ఢిల్లీకి ఫోన్ చేసి సుధీర్‌తో మాట్లాడాను. సుధీర్‌తో నా ఫ్రెండ్ శ్రావణ్‌కి దగ్గరి ఫ్రెండ్‌షిప్ ఉంది. ఆయనే ఫోన్లో నాకు పరిచయం చేయిస్తే మాట్లాడాను. నీ గురించి అన్ని విషయాలూ చెప్పాను. అతను చాలా బాధపడ్డాడు. నీ గురించి తెలియక ఏదేదో వాగాడట. సారీ చెప్పమని కూడా అన్నాడు. నీతో మాట్లాడతానని కూడా అన్నాడు. నేనే వద్దని చెప్పాను. ఎల్లుండి శనివారం ఢిల్లీకి వెళ్లటానికి టిక్కెట్లు బుక్‌చేయిస్తాను, రెడీగా ఉండు!" జరగాల్సిందంతా చెప్పి ఊపిరి పీల్చుకున్నాను.

"అరుణా! ఇంత అర్జెంట్‌గా తేల్చుకోమంటే ఎలా?...."

ఉమను ఆపేస్తూ "నీచాతగానితనంతో ఎందరిని బాధపెడతావు? ఏదీ సరిగ్గా తేల్చవు. నీ నిర్ణయాలు నీవు తీసుకోవు. నిన్ను మార్చటం ఎవరి వల్లా కాదు. సమస్యకి పరిష్కారం వెతుక్కోవటం ముఖ్యం కానీ, దాటవేయటం కాదు!" చెప్పాను.

మౌనంగా ఉండిపోయింది ఉమ.

"చీకటి పడుతోంది, వెళ్దామా?" అన్నాను.

ఇద్దరం బస్సులో ఇంటికి చేరుకున్నాము. బస్సులో కూడా ఏమీ మాట్లాడుకోలేదు.

ఉదయం ఆరుగంటలకు బస్టాండ్ వరకూ వచ్చింది దిగబెట్టడానికి. సుధీర్ విషయాన్ని మళ్లీ కదపాలనిపించలేదు.

బస్సు ఎక్కబోతుంటే, నా చేయి గట్టిగా పట్టుకుని "థాంక్స్, అరుణా! నీవు చేస్తున్న సహాయానికి నా జీవితమంతా ఋణపడి ఉంటానే! రాత్రి సుధీర్‌తో ఫోన్లో మాట్లాడాను. ఇప్పుడున్న ప్రాజెక్ట్ ఇంకో నెలరోజుల్లో పూర్తవుతుందట. అది పూర్తి కాగానే అతనికి హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ అవుతుందని, నన్ను అర్జెంట్‌గా హైదరాబాద్ డిప్యూటేషన్‌కోసం ప్రపోజల్స్ పంపించుకోమన్నాడు...."

బస్సు హారన్ మోగిస్తున్నాడు డ్రైవర్. అందరూ ఎక్కేస్తుంటే నేను గబగబా ఎక్కేశాను. బస్సు కదులుతుంటే చేయి ఊపుతూ నిలబడింది ఉమ. ఇప్పుడు ఆమె ముఖంలో విషాద ఛాయలు కనిపించట్లేదు. బస్సు బస్టాండ్‌ను దాటింది.

గట్టిగా ఊపిరి పీల్చుకున్నాను. ■